


## నెలనెలా నవ్వుల పండగ

## మల్లాది వెంకటకృష్ణమూర్తి స్పెషల్

### ఇరుగు - పొరుగు



**ఒకప్పుడు** ఇరుగు పొరుగుగా జీవించిన ఇద్దరు ఆడవాళ్ళు చాన్నాళ్ళ తర్వాత మార్కెట్లో కలుసుకున్నారు

"మేం ఇప్పుడు శ్రీనగర్ కాలనీలో ఉంటున్నాం. చక్కటి ఇరుగు పొరుగు."చెప్పింది మొదటావిడ ఉత్సాహంగా.

"మా ఇరుగూ పొరుగూ కూడా చాలా మంచివాళ్ళు దొరికారు" చెప్పింది రెండో ఆవిడ వెంటనే.

"అయితే మీరు గాంధీనగర్ నుంచి మారారా?"

"లేదు.. ఇంకా మీరు ఖాళీ చేసిన పక్కింట్లోనే వుంటున్నాం" గడుసుగా చెప్పింది రెండో ఆవిడ.

* * * *

## చౌచౌ... ఏరుకొచ్చిన నవ్వులు

"నేనో కెమిస్ట్ సలహా తీసుకున్నాను. అతడు.."

"అలాంటివాళ్ళ సలహాలు వింటే మీ ప్రాణాలు నిలిచినట్లే, ఇంతకీ అతడేమన్నాడు?" రోగి మాటలకడ్డొస్తూ అన్నాడు డాక్టరు.

"మిమ్మల్ని వెంటనే కలవమన్నాడు. సరే వస్తా" అంటూ వెళ్ళిపోయాడు రోగి.

"డాక్టర్‌గారూ మా ఆవిడ సుకుమారమైన చేతులు అంట్లుతోముతుంటే కందిపోవడం చూడలేకపోతున్నాను. ఏం చేయమంటారు?" అడిగాడో పతిదేవుడు.

"సింపుల్ ఆ అంట్లు మీరే తోమండి" సలహా యిచ్చాడు డాక్టర్.

"ఒరేయ్! మేము ఇంట్లో లేనపుడు ఏమయినా అల్లరిపనులు చేశారా?" బాయనుండి ఇంట్లోకి వస్తూనే ఆత్రంగా అడిగారు భార్యాభర్తలు తమ పిల్లల్ని.

"నేను టీ పెట్టాను" అన్నాడు పెద్ద కుర్రాడు.

"నేను టీ తాగిన కప్పుసాసర్లు, గిన్నెలు కడిగేశాను" అన్నాడు చిన్నకుర్రాడు.

"మరి ఆ కప్పులు, సాసర్లు ఏవీ?"

"పగిలిపోయినవాటిని ఏం చేసుకుంటామని బయట పడేశాము" ముక్తకంఠంతో చెప్పారిద్దరూ.

"ఓ దుకాణదారు కొత్తగా వచ్చిన కష్టమర్‌తో ఇంగ్లీషులో మాట్లాడటం ఆరంభించాడు.

"చూడు బాబూ నాకు ఇంగ్లీష్ రాదు. తెలుగులో చెప్పు" అందా కష్టమర్.

"మిమ్మల్ని చూస్తుంటే ఇంగ్లీషురానివారిలా లేరు."

"దాందేముంది. నిన్ను చూస్తే మాత్రం ఇంగ్లీషు వచ్చినవాడివని ఎవరనుకుంటారు గనుక."

❦❦❦

"ఎవరికీ తెలియని మీరు ఎలక్షన్లలో బ్రహ్మాండమైన మెజారిటీతో గెలిచారే? చాలా మందికి తెలిసిన నేను ఎన్నికల్లో ఓడిపోవటం ఆశ్చర్యంగా ఉంది"

"నా గత చరిత్ర కొద్దిమందికే తెలిసి ఉండడం వల్లనే బంపర్ మెజారిటీతో గెలవగలిగాన్నేను. అదీ అసలు సంగతి"

❦❦❦

"మీరు ఎలక్షన్‌లో ఓడిపోవడానికి ప్రధాన కారణం ఏమిటంటారు?" అడిగాడు విలేఖరి.

"ప్రజలు చైతన్యవంతులుగా రూపొందుతుండటమే" నిట్టూర్చారా మాజీ మంత్రిగారు.

❦❦❦

నుదుటిమీద మచ్చకు ప్లాస్టిక్ సర్జరీ చెయ్యడానికి ఎంత ఖర్చవుతుంది డాక్టర్?"

"వెయ్యి రూపాయలవుతుంది"

"అబ్బా! అంతకంటే తక్కువలో మరో పద్దతేమన్నా ఉంటే చెప్పండి"

"లేకేం? చాలా చవకయిన పద్ధతి ఓ మేలిముసుగు కొని రోజూ వేసుకోవడం."

❦❦❦

అర్థరాత్రి ఓ డాక్టరింట్లో టెలిఫోన్ మోగింది.

"హలో! డాక్టర్ రాజు స్పీకింగ్" అన్నాడు రిసీవరెత్తిన డాక్టర్.

"నమస్తే డాక్టర్. నాభార్యకు రెండేళ్ళ క్రితం అపెండిసైటిస్ ఆపరేషన్ చేశారు మీరు. ఇప్పుడు హఠాత్తుగా మా ఆవిడ కడుపులో నెప్పని మెలికలు

తిరిగిపోతూవుంది. బహుశా అపెండిసైటిసేమోనని అనుమానంగా వుంది. దయచేసి ఒక్కసారి పాతబజారులోని ఆరో నెంబరు ఇంటికొస్తారా?" గుక్క తిప్పుకోకుండా చెప్పింది అవతలి కంఠం.

"ఒకే మనిషికి రెండుసార్లు అపెండిసైటిస్ రావడం ఇంతవరకూ వైద్య చరిత్రలో ఎక్కడా వినలేదు నేను" అన్నాడు ఒళ్ళు మండిన డాక్టర్.

"ఒక మనిషికి రెండోభార్య ఉండవచ్చని విని ఉండలేదా?"

నాటకం చూసివస్తున్న ఇద్దరు మిత్రులిలా మాట్లాడుకుంటున్నారు.

"ఒరేయ్ నాటకంలో ఏ భాగం నచ్చింది నీకు?"

"జోకర్ పాత్ర చాలా బావుంది."

"జోకర్ పాత్ర లేనేలేదుగా?"

"ఇందులో జోకర్ పాత్ర వేద్దామనుకున్న వ్యక్తేగదా మనకి ఫ్రీ పాసులిచ్చింది."

"తాగుడు విషయంలో నేను చెప్పినట్లే చేస్తున్నావా?" అడిగాడు డాక్టర్.

"ఆ... ఇప్పుడు రోజుకు నేను నాలుగుసీసాలకంటే తాగడంలేదు."

"నేను తాగమంది రెండు సీసాలేగా?"

"అవున్సార్ మీరు తాగమంది రెండు సీసాలు, మా ఎదురింటి డాక్టర్ తాగమంది కూడా రెండు సీసాలే. వెరసి నాలుగు సీసాలవలేదూ"

COMMENTS